క్లుప్తంగా

విజయవాడకు వెళ్లిన భవానీ మాలధారులు



మొగల్తూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: మొగల్తూరులో దీక్షచేపట్టిన భవానీ మాలధారులు పాదయాత్రగా విజయవాడకు బయలుదేరి వెళ్లారు. పులపర్తి ఏడుకొండలు గురు భవానీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయలో పూజలు చేసి సుమారు 45 మంది భవానీలు పాదయాత్రగా వెల్లారు. భవానీలు పాదయాత్రగా పాతకాలువ వరకూ గ్రామోత్సవం నిర్వహించారు.

పెనుగొండలో..

పెనుగొండ: భవానీ మాల ధారుల గ్రామోత్సవం బుధవారం వేడుకగా నిర్వహించారు. భవానీ పీఠం నుంచి గురు భవానీ పిల్లి శంకరం , నక్కా వేద వ్యాస శాస్త్రిల ఆధ్వర్యంలో భవానీ మాలధారులు అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఆలయ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

దాతకు సత్కారం

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్న దాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త నడపన జగపతిరావుకు సేవలు అభినందనీయమని పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. బుధవారం భవానీప్రసాద్ భరతమాత చిత్రపటం, శాలువతో జగపతిని సత్కరించారు. భవానీప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల తమ పాఠశాలతో పాటు మరో రెండు పాఠశాలలకు పుస్తకాలు, ఫ్యాన్లు, మైక్ సెట్, డీఎన్నార్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ. 50 వేలు నగదు ఇచ్చి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జగపతిని ఆయన నివాసంలో సత్కరించారు.

పద్దాల వెంకమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలకరణలో పద్దాల వెంకమ్మ

పెనుగొండ: పెనుగొండ శాంతి నగర్‌లో పద్దాల వెంకమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తమనంపూడి అనంత, గాయత్రీ, తమనంపూడి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

30న గుమ్మలూరులో సివిల్‌రైట్స్ డే

పోడూరు: మండలంలోని గుమ్మలూరు గ్రామంలో సచివాలయం-1 వద్ద ఈ నెల 30న సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర'



పెనుమంట్ర: నెగ్గిపూడిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుమంట్ర: మార్టేరులో క్రికెట్ ఆడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ: ఆచంటలో కబడ్డీలో పోటీ పడుతున్న క్రీడాకారులు



పెనుగొండ: కొడమంచిలిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు



పోడూరు: జిన్నూరులో క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న నాయకులు



పోడూరు: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పెనుమంట్ర: గ్రామీణ క్రీడాకారులలో అణగారిపోతున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం నెగ్గిపూడి గ్రామంలోని శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రూ. 21.08 లక్షలతో నిర్మించిన ప్రహరీను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య ప్రారంభించగా, శిలాఫలకాన్ని అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారిణి సత్తి గీతారెడ్డితో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి చూపేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, మార్టేరు, నెగ్గిపూడి గ్రామ సర్పంచ్‌లు మట్టాకుమారిరాము, పెచ్చెట్టి ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ లక్ష్మి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ, సత్తి సబ్బన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, మార్టేరు, నెగ్గిపూడి ఉపసర్పంచ్‌లు కర్రి వేణుబాబు, అల్లంసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సీఎం జగన్ ప్రోత్సాహం

పెనుగొండ: 'ఆడుదాం ఆంధ్ర'తో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర రెండవ రోజు బుధవారం కొడమంచిలి, ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరంల్లో పోటీలను ఏఎంసీ చైర్ పర్సన్ చిల్లే లావణ్య, సర్పంచ్‌లు కోట సరోజనీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటిలు ప్రారంభించారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి ఇటువంటి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పీడీ చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే రవి కుమార్, పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్, పెచ్చెట్టి సత్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో

పెనుగొండ మండలం పెనుగొండ, వడలి, సిద్ధాంతం, దేవల్లో రెండవ రోజు బుధవారం ఆటల పోటీలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం , సర్పంచ్‌లు నల్లూరి సత్యనారాయణ, కాసాని విజయలక్ష్మీ, చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, రెడ్డి గణేశ్వరరావు, చిటికెన గంగా భవానీ బాబీ, సాకా సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. పోడూరులో బుధవారం ఎంపీడీఓ డి.సుహాసిని, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు పోటీలను పర్యవేక్షించారు. జిన్నూరులో సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు క్రీడాకారులకు కిట్లు అందజేశారు. గుమ్మలూరు, వేడంగి, జిన్నూరు, మట్టపర్రు గ్రామాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుమ్మలూరు గ్రామంలో గుమ్మలూరు, రావిపాడు, వద్దిపర్రు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సర్పంచ్ గొట్టుముక్కల సోనియారాణి పోటీలను పర్యవేక్షించారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



ప్రార్థనల్లో పాల్గొన్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: క్రీస్తు బోధనలు ఆచరణీయమని వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. బుధవారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం, సీతారాంపురం వెంకట్రావు తోట, పట్టణంలోని 26వ వార్డు పాకెర్లవారిపేటలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు.

జిన్నూరుపాలెంలో క్రిస్మస్ వేడుకలు

పోడూరు: జిన్నూరుపాలెంలో ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ స్టెయిన్ అధ్యక్షత న జరిగిన క్రిస్మస్ వేడుకల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. యూత్ సభ్యుల యాక్షన్ సాంగ్స్, క్యాండిల్ సర్వీస్ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఎంపీటీసీ కడలి పద్మావతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు, తొండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నాభిషేకం



జుత్తిగలో సోమేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు.

పెనుమంట్ర: ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీఉమా రామలింగేశ్వరస్వామి వారికి, జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి వార్లకు ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆరుద్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం శాస్త్రోక్తంగా అన్నాభిషేకాన్ని వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఆలయ అర్చకులు ర్యాలీ వాసుశర్మ, రామేశ్వరపు భాస్కరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు తమనంపూడి వీర్రెడ్డి, నల్లమిల్లి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే గ్రామాభివృద్ధి



నీరుల్లి పాలెంలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆనందప్రకాష్

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి మెండుగా జరిగిందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. బుధవారం ఆచంట మండలం నీరుల్లిపాలెంలో రూ.25 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సీసీ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు అభివృద్ధిని తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, అంగన్‌వాడీ భవనాలు ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారన్నారు. మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సీసీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చెల్లెం మోహనరావు, ఆమోష్, వడ్లపాటి శాంతారావు, ఖండవల్లి నాగేశ్వరరావు, గొల్ల క్రాంతి, బుడితి ఎస్కేలు తదితరుల పాల్గొన్నారు.

కొడమంచిలిలో

రూ.20 లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణానికి కొడమంచిలి టి.మెరక రహదారిని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ శంకుస్థాపన చేశారు. రహదారి నిర్మాణానికి సహకరించిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, పుచ్చకాయల నాగార్జున, చింతపర్తి హరికృష్ణ, మన్నే సుబ్బారావు, నల్లూరి చందు, మన్నే రవికుమార్, బొరుసు రాంబాబు, పోలిశెట్టి వనమరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మున్సిపల్ బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నరసాపురం మున్సిపల్ బడ్జెట్‌ను రూ.95,82,000 మిగులుతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన బుధవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలు రూ 8,35,58,000లు ప్రారంభ నిల్వతో ప్రారంభించి లెక్కకట్టారు. రాబోయే ఆర్థిక సంవత్సరం పన్నులు, ప్రభుత్వ గ్రాంట్లు తదితర పద్దుల ద్వారా రూ.52,03,45,000 ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఇక ఏడాది మొత్తం ఖర్చులు రూ.59,43,21,000లు అవుతుందని తేల్చారు. ఖర్చులు పోనూ రూ.95,82,000 మిగులు చూపించారు. ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ గ్రాంట్లు, జనరల్ ఫండ్స్‌ను రోడ్లు, డ్రెయిన్స్, మంచినీటి సరఫరా మెరుగుదలకు పెద్ద ఎత్తున ఖర్చు చేయాలని నిర్ణయించారు.

వాడీవేడిగా సాధారణ సమావేశం..

బడ్జెట్ సమావేశం, అనంతరం జరిగిన సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్ బడ్జెట్ కేవలం అంకెల గారడీగా ఉందని ఆరోపించడంతో గొడవ మొదలైంది. వైఎస్సార్‌సీపీ సభ్యులు కేసరి గంగరాజు, సఖినేటిపల్లి సురేష్‌లు కోటిపల్లి సురేష్‌తో వాగ్వివాదానికి దిగారు. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక గ్రాంట్లు పట్టుకొచ్చి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఆ గొడవ నేపథ్యంలో కోటిపల్లి సురేష్ బడ్జెట్ అంశాన్ని కాకుండా రాజకీయాలు మాట్లాడడంపై కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ఉంటే బయట మాట్లాడుకుందాం.. బడ్జెట్ బాగుంది, మా ఎమ్మెల్యే మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడుతున్నారు అన్నారు. ఇవి నిజాలు అని ఈ గొడవను ఇక్కడితో ఆపాలని సూచించడంతో గొడవ సద్దుమణిగింది. వైకేఎస్‌తో పాటు వైస్‌చైర్ పర్సన్ కామన నాగిని, వైఎస్సార్ సీపీ సభ్యులు బొంతు రాజశేఖర్, పతివాడ పద్మ, సోమరాజు దుర్గాభవానీ తదితరులు బడ్జెట్‌లో కేటాయింపులు పట్టణ అభివృద్ధికి దోహదం చేసేలా ఉన్నాయని చెప్పారు. పట్టణంలో డ్రెయిన్స్, రోడ్లు అభివృద్ధికి అధిక నిధులు ఖర్చుపెట్టి బాగు చేయాలని వన్నెంరెడ్డి శ్రీనివాస్ కోరారు. మరో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మాట్లాడుతూ బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు సవ్యంగా, ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని కోరాఉ. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కళ్యాణమండపంగా అభివృద్ధి చేస్తున్నామని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డంపింగ్‌యార్డ్ సమస్య తీరుస్తున్నామని చెప్పారు. సభ్యులు అడిగిన పలు పశ్నలకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సమాధానం ఇచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు అడిదల శ్యామల, జిల్లెళ్ల దిలీప్, పాలూరి బాబ్జి, షేక్ యాకూబీబీ, అబేధాసుల్తానా, మల్లాడి శేషవేణి, బర్రి జయరాజు, కావలి రామసీత, ద్వారా గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిపై ఇంటింటి సర్వే



లంకలకోడేరులో లెప్రసీ వ్యాధి నివారణ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: లెప్రసీ వ్యాధి నివారణలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి 2027 నాటికి కుష్టు వ్యాధి రహిత సమాజంగా మార్చనున్నట్లు మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణలో భాగంగా బుధవారం నుంచి జనవరి 12 వరకూ ఇంటింటి నిర్వహించనున్న సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం బ్రోచర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ సర్వేలో గుర్తించిన కేసులకు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు చెప్పారు. స్పర్శ లేని రాగి రంగుతో నిగారింపు ఉండే చెమట పట్టని మచ్చలు గానీ, చెవిపై బుడిపెలు ఉండడం, నడిచేటప్పుడు కాళ్లు జారిపోవడం, చేతులతో ఏదైనా వస్తువు పట్టుకున్నప్పుడు జారిపోవడం తదితర లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని డా. ప్రతాప్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రాంప్రసాద్, ఆరోగ్యవిస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కి అండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు, మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు చీకట మిల్లి మంగరాజు స్పష్టం చేశారు. పాలకొల్లులో మాలమహనాడు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ 175 కి 175 స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట అభ్యర్థులను మారుస్తున్నారని, అయితే వైఎస్సార్ సీపీ పని అయిపోయిందంటూ ఎల్లో మీడియా సహకారంతో చంద్రబాబునాయుడు దుష్ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు 20 శాతం కూడా అమలు చేయలేకపోయారన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి నూటికి నూరుశాతం హామీలను అమలు చేశారన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చంద్రబాబుకి ప్రజల్ని మోసం చేయడంలో ఆరితేరిన వ్యక్తి అని అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కుతారన్నారు. సమావేశంలో మాలమహనాడు నాయకులు కె రాజారా, సుధామా, శ్రీనివాస్, సునీల్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణ పథకాలు వద్దని నిరసన

భీమవరం: ఆర్టీసీ బసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆటో వర్కర్స్ పొట్టకొట్టవద్దని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అన్నారు. బుధవారం భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీఎస్‌ఆర్టీసిలో ఉచిత ప్రయాణమంటూ రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో పెట్టడం వల్ల జిల్లాలోని వేలాది మంది ఆటోవర్కర్స్ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోల్లో ఎక్కువగా మహిళలే ప్రయాణిస్తుంటారని ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న ఆటో వర్కర్స్ కుటుంబాల పరిస్థితి దుర్భరంగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంపన గోపి, లింగం రాంబాబు, వాసు ఆరేపల్లి బాలాజీ, సంజీవరావు పాల్గొన్నారు.

నేడు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ పీజీ, డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు బుధవారం కళాశాల చైర్మన్ కేవీ నరసింహరావు విలేకరులకు తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్‌బిఐటీ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, ఫోన్ పే వంటి మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంవారైనా ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు వచ్చే అభ్యర్థులు వారి అకాడమిక్ సర్టిఫికెట్స్ జిరాక్స్, రెండు ఫొటోలు, బయోడేటా తీసుకురావాలన్నారు. అభ్యర్థులు ఇంటర్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీఈ, బీటెక్, ఎంసీఏల్లో అర్హతలు కలిగి 2019 నుంచి 2023 లోపు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు గురువారం ఉదయం 9.30 గంటలకు కళాశాల ప్రాంగణంలో తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలు కోసం ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. లక్ష్మణరావు 97013 94660కు ఫోన్ చేయాలని సూచించారు.